దిత్వా తుఫానుతో నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి

3 లో

విశాలాంధ్ర

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా



గురువారం 11, డిసెంబరు -2025 4 పేజీలు

రైతులకు విత్తనాలు, ఎరువులు అందించాలి

- తుపాను కారణంగా నారుమళ్లు, వరినాట్లు దెబ్బతిన్న రైతులను ఆదుకోవాలి
- ధాన్యానికి మద్దతు ధర కల్పించి రైతులు నష్టపోకుండా చూడాలి
- సిపిఐ జిల్లా కార్యదర్శి అరిగెల సాయి, రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శానాన్వాస్, గంగపట్నం రమణయ్య
- రైతులకు సబ్సిడీపై విత్తనాలు అందించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉంది: జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర-బ్యూరో నెల్లూరు: రైతాంగ సమస్యలపై జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట సిపిఐ రైతు సంఘాల ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి అరిగెల సాయి రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శాన్వాస్ గంగపట్నం రమణయ్య మాట్లాడుతూ జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాల వలన రైతులు తీవ్రంగా నష్టపోయారని, తుఫాన్ కారణంగా 14 వేల ఎకరాల్లో నారుమళ్లు, 1.50 లక్షల ఎకరాల్లో వరి నాట్లు దెబ్బతినగా దాదాపు 200 ఎకరాలలో వేరుసెనగ దెబ్బతిన్నదని, అదేవిధంగా కండలేరు ప్రాజెక్టు పొంగి పొర్లుతూ ఉండడంతో ఇప్పటికీ కొన్ని ప్రాంతాలు నీటిలోనే ఉన్నాయన్నారు. మళ్లీ నార్లు పోసుకోవటానికి విత్తనాలు కూడా అందుబాటులో లేవని జిల్లా రైతాంగానికి అవసరమైన మేరకు విత్తనాలు యూరియా సరఫరా చేయాలని జిల్లా కలెక్టర్ ను వారు డిమాండ్ చేశారు. ధాన్యం పంటలకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలతో పాటు రాష్ట్ర ప్రభుత్వం బోనస్ ప్రకటించి కొనుగోలు చేయాలని, భూమిలేని కౌలురైతులకు అన్నదాత సుఖీభవ పథకాన్ని వెంటనే అమలు చేయుట గురించి ఖరీఫ్ సీజన్‌లో 50 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు చేస్తామని, అందుకు గాను 6 కొట్ల70లక్షల గోనె సంచులు అందుబాటులోఉంచుతామని చెప్పి ఆచరణలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందన్నారు. తేమశాతం పేరుతోనూ, ధాన్యం రంగు మారిందని, తాలు, తప్పలు ఉన్నాయని ధాన్యం కొనుగోలు చేయకుండా అనేక కొర్రీలు పెడుతున్నారు. కనీసం పంటను ఆరబెట్టుకోవడానికి, తడవకుండా కాపాడుకోవడానికి పట్టాలు కూడా ఇవ్వడం లేదు. కొనుగోలు కేంద్రం, రైతు సేవ కేంద్రం, రవాణా ఇన్ చార్జిలు, కస్టోడియన్ ఆఫీసర్లు రైస్ మిల్లర్స్ కుమ్మక్కై ధాన్యం దళారులకు అమ్ముకునే విధంగా వ్యవహరిస్తున్నారన్నారు. దీంతో 75 కేజీల బస్తాను రూ.1200 అమ్ముకొని బస్తాకు రూ.400 నుంచి 500 వరకు నష్టపోతున్నారు. రైతు ప్రయోజనాలకు నష్టం చేసే విధంగా సీడ్ బిల్లు, విద్యుత్తు బిల్లును పార్లమెంట్లో ప్రవేశపెట్టారని, ఆ బిల్లులను పూర్తిగా రైతాంగం వ్యతిరేకిస్తుందని వారు తెలిపారు. అనంతరం వారు జిల్లా కలెక్టరుకు వినతిపత్రం అందజేసి జిల్లా సమస్యలపై వివరించగా దీనిపైన స్పందించిన జిల్లా కలెక్టర్ రైతాంగ సమస్యలపై ఎంతో సానుకూలంగా ఉన్నారని జిల్లాలో దెబ్బతిన్న రైతాంగానికి విత్తనాలను 80% సబ్సిడీతో ఇచ్చేందుకు ఇప్పుడే రంగం సిద్ధం చేశామని అలాగే అవసరమైన మేరకు రైతులకు యూరియాను అందించేందుకు సిద్ధంగా ఉన్నదని రైతులెవరూ ఈ విషయంలో ఆందోళన చెందవలసిన అవసరం లేదని హామీ ఇచ్చారని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు వి.రామరాజు జిల్లా కార్యవర్గ సభ్యులు కే వినోదమ్మ, సిరాజ్, కౌలు రైతులసంఘం జిల్లా కార్యదర్శి కీలుకుప్పం రాజగోపాల్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి దమ్ము దర్గా బాబు సర్వేపల్లి నియోజకవర్గ సిపిఐ కార్యదర్శి ఏడుకొండలు ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మున్న, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మస్తాన్ సిపిఐ నెల్లూరు రూరల్ మండల సహాయకార్యదర్శి ఆదినారాయణ, మహిళా సంఘం నగర అధ్యక్షురాలు వనజ, విద్యార్థి సంఘం నగర కార్యదర్శి శివం, చేనేత కార్మిక సంఘం నాయకులు గ్రామ ఉప సర్పంచి సల్లా నరసయ్య లతోపాటు పలువురు రైతులు యువజన విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వైద్యకళాశాలల ప్రైవేటీకరణపై తప్పుడు ప్రచారాన్ని ఖండించిన రాజ్యసభ సభ్యులు

ఉపరాష్ట్రపతిని కలిసి వివరాలు అందజేసిన టిడిపి ప్రతినిధులు

విశాలాంధ్ర-బ్యూరో నెల్లూరు: ఆంధ్రప్రదేశ్‌లో వైద్య కళాశాలల ప్రైవేటీకరణపై జరుగుతున్న తప్పుదోవ పట్టించే ప్రచారంపై స్పష్టత ఇవ్వడానికి తెలుగుదేశం పార్టీ రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్ రావు యాదవ్,సాన సతీష్ భారత ఉపరాష్ట్రపతి నిన్యూఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిసి వివరాలను అందజేశారు. ఈ సందర్భంగా ఇద్దరు నాయకులు మాట్లాడుతూ, "మెడికల్ కాలేజీలను ప్రైవేటు చేతుల్లోకి ఇవ్వడం, అమ్మడం, యాజమాన్యం బదిలీ చేయడం వంటి చర్యలు ఎక్కడా లేవు. 'ప్రైవేటీకరణ' అనే పదాన్ని ఉపయోగించి ప్రజల్లో భయాందోళనలు రేపడం పూర్తిగా రాజకీయ ప్రయోజనాల కోసం మాత్రమే జరుగుతోంది" అని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం ప్రకటించిన 16 మెడికల్ కాలేజీలలో అనేక చోట్ల భూమి స్వాధీనం, డీపీఆర్ లు, టెండర్లు, నిధుల విడుదల పూర్తికాలేదని, భవనాలు 20-30 దశలోనే నిలిచిపోయాయని అధికారులు ఉపరాష్ట్రపతికి వివరించారు. ఈ పరిస్థితుల్లో ప్రజా ప్రయోజనం కోసం పీపీపీ మోడల్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వినియోగిస్తున్నారని తెలిపారు. పీపీపీ అంటే ప్రైవేటీకరణ కాదని, అది కేవలం ఫ్యాకల్టీ నియామకం, మౌలిక వసతులు, హాస్పిటల్ ఆపరేషన్లను వేగంగా పూర్తి చేయడానికి తీసుకునే సాంకేతిక-వ్యవస్థాపక సహాయం మాత్రమేనని చెప్పారు. "సాయం తీసుకోవడం వేరే విషయంబీ అధికారం ఇవ్వడం వేరే విషయం. ఎక్కడా ప్రభుత్వ హక్కు తగ్గదు" అని వారు స్పష్టం చేశారు.ఎన్ ఎం సి మార్గదర్శకాల ప్రకారం ఎంబిబిఎస్ ఫీజులు, ప్రభుత్వ సీట్లు పూర్తిగా యథాతథంగానే ఉంటాయని, ఫీజులు పెరుగుతాయి అనే ప్రచారం పూర్తిగా అసత్యమని వివరించారు. పీపీపీ మోడల్ వల్ల 24×7 వైద్య సేవలు, ఐసీయూ లు, ట్రామా కేర్, స్పెషాలిటీ యూనిట్లు త్వరగా ఏర్పడతాయని, జిల్లా వారీగా మెడికల్ సీట్లు పెరిగి స్థానిక యువతకు అవకాశాలు విస్తరిస్తాయని తెలిపారు. వేలాది డాక్టర్లు, నర్సులు, టెక్నీషియన్లకు కొత్త ఉద్యోగాలుసృష్టించబడతాయని వారు తెలిపారు."ప్రజల ఆరోగ్యం, విద్యార్థుల భవిష్యత్తు, వైద్య ఉద్యోగాల అవకాశాలు ఇవన్నీ బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్మని, భయపెట్టే ప్రచారాలను ప్రజలు నమ్మరని, ప్రభుత్వం తీసుకుంటున్న సంస్కరణలకు పూర్తిగా మద్దతు ఇస్తారని" అని బీద మస్తాన్ రావు యాదవ్ సాన సతీష్ ఉపరాష్ట్రపతికి వెల్లడించారు.

అమృత ఆరోగ్యకార్డులు పంపిణీ చేసిన కలెక్టర్

విశాలాంధ్ర-బ్యూరో నెల్లూరు: డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవా లో భాగంగా అనాథలు, నిరాశ్రయులు, సీనియర్ సిటిజన్ల కోసం అమలు చేస్తున్న అమృత ఆరోగ్య పథకాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరింత విస్తరించనుంది. జిల్లాలో రెండో విడత లో 59మందికి ఈ పథకం వర్తింపజేయాలని ఆదేశాలు జారీ చేసారు. ఈ మేరకు కలెక్టరేట్ లో గౌరవ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా లబ్ధిదారులకు ఆరోగ్య కార్డులు పంపిణీ చేశారు. తదుపరి చర్యలు తీసుకోవాలని ఎన్టీఆర్ వైద్య సేవా జిల్లా సమన్వయ కర్త డాక్టర్ ఎన్ వీ సుధీర్ కుమార్ కు సూచించారు. మొదటి విడత జిల్లాలో 518 మంది ఈ పథకం పరిధిలో ఉన్నారు. గుర్తించిన వారందరికీ ఎన్టీఆర్ వైద్య సేవా పథకం లో అనుసంధానించ చబడిన హాస్పిటల్స్ ద్వారా ఉచితంగా చికిత్సలు అందించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 3255 చికిత్సలు /శస్త్ర చికిత్సలు సహా ఏటా రూ 25లక్షలు వరకు ఉచిత వైద్యం అందిస్తోంది. ఈ కార్యక్రమం లో ఎన్టీఆర్ వైద్య సేవా జిల్లా సమన్వయ కర్త డాక్టర్ ఎన్వి.సుధీర్ కుమార్, ఐసిడి ఎస్ పీడీ హేమా సుజన తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ఆసుపత్రి ఏర్పాటు పై కేంద్ర మంత్రి సానుకూల స్పందన



విశాలాంధ్ర-బ్యూరో నెల్లూరు: రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు యాదవ్, నెల్లూరు లోక సభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి న్యూఢిల్లీలో కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ని కలిసి, నెల్లూరు జిల్లా ప్రధాన కేంద్రంలో పూర్తిస్థాయి రైల్వే ఆసుపత్రి ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగామంత్రి వీరి ప్రతిపాదనను సానుకూలంగా అంగీకరించినట్లు వెల్లడించారు. నెల్లూరు రైల్వే స్టేషన్ రోజుకు 22,000 మందికి పైగా ప్రయాణీకులను,110 రైళ్లను నిర్వహిస్తున్న, ఇప్పటికే స్టేషన్ అభివృద్ధికి 102 కోట్ల నిధులు మంజూరు అయ్యాయి. అయినప్పటికీ, ఇంత పెద్ద జిల్లాకేంద్రంలో ఇప్పటికీ రైల్వే ఆసుపత్రి లేకపోవడం ఉద్యోగులు, పింఛన్‌దారులు, ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడేలా చేస్తోంది. నెల్లూరులో 500 మంది రైల్వే ఉద్యోగులు, 850 మంది పింఛన్‌దారులు ఉండగా, నెల్లూరులో వెంటనే పూర్తి స్థాయి రైల్వే ఆసుపత్రిని ఏర్పాటు చేయాల్సిన అవసరం అత్యవసరం అని ఇద్దరు ఎంపీలు మంత్రి కి వివరించారు. ఈ విజ్ఞప్తిని మంత్రి అశ్విని వైష్ణవ్ ఎంతో సానుకూలంగా తీసుకొని, నెల్లూరులో రైల్వే ఆసుపత్రి ఏర్పాటు ప్రతిపాదనను అమలుచేస్తామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా బీద మస్తాన్ రావు యాదవ్ మాట్లాడుతూ "రైల్వే ఉద్యోగులు, పింఛన్‌దారులు తమ జీవితమంతా రైల్వే సేవకు అంకితం చేశారు. ఇప్పుడు వారికి అవసరమైన సమయంలో సమీపంలోనే వైద్య సదుపాయం అందుబాటులో ఉండాలి. నెల్లూరులో రైల్వే ఆసుపత్రి ఏర్పాటుకు కేంద్ర మంత్రి అంగీకరించడం చాలా సంతోషముఅన్నారు.

'పొలం పిలుస్తోంది'లో పాల్గొన్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

విశాలాంధ్ర-కలువాయి: కలువాయి మండలం తోపుగుంట గ్రామంలో బుధ వారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నెల్లూరు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సత్యవాణి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె తోపుగుంట గ్రామంలోని జొన్న పంటను పరిశీలించి తెగుళ్లు, వాటి నివారణ చర్యలు గురించి రైతులకు వివరించారు. ముఖ్యంగా రైతులు పొలం పిలుస్తుంది కార్యక్రమంలో పాల్గొని సిబ్బంది ఇచ్చే సలహా సూచనలు పాటించాలని తెలిపారు. అదేవిధంగా రైతులు సమస్యలు వారికి తెలియజేయాలని సూచించారు. అలాగే జిల్లాలో రబీ సీజన్ గాను ఐదు లక్షల ఎకరాలు సాగులో ఉందని, వారికి ఇప్పటివరకు 35 వేల టన్నుల యూరియాను సరఫరా చేయడం జరిగిందని, రానున్న రెండు మూడు నెలల్లో ఇంకా 65 వేల టన్నులు వచ్చే అవకాశం ఉందని వాటిని జిల్లాలోని 425 ఆర్ ఎస్ కే సెంటర్లలోనూ, అదేవిధంగా 56 సొసైటీలు ద్వారా ప్రతి రైతుకి అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడిఏ శివ నాయక్, ఏవోలు కళారాణి, మంజుల, టిడిపి నాయకులు హరిబాబు నాయుడు, చంద్రమౌళి నాయుడు, గడ్డం కిషోర్ రెడ్డి, జగదల్ నాయుడు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను ఆదుకోవాలి

విశాలాంధ్ర-కందుకూరు: భూమిలేని కౌలురైతులకు అన్నదాత సుఖీభవ పథకాన్ని వెంటనే అమలు చేయాలని ధాన్యం, పత్తి, మొక్కజొన్న, అరటి, తదితర పంటలకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలతో పాటు రాష్ట్ర ప్రభుత్వం బోనస్ ప్రకటించి కొనుగోలు చేయాలని, భూమిలేని కౌలురైతులకు అన్నదాత సుఖీభవ పథకాన్ని వెంటనే అమలు చేయాలని సిపిఐ రాష్ట్ర సమితి, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా కందుకూరు సిపిఐ కందుకూరు నియోజకవర్గ కార్యదర్శి బూసి సురేష్ బాబు ఆధ్వర్యంలో స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో బుధవారం సబ్ కలెక్టర్ దామెర హిమ వంశీ కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ లో 50 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు చేస్తామని, అందుకు గాను 6 కొట్ల 70లక్షల గోనె సంచులు అందుబాటులో ఉంచుతామని చెప్పి ఆచరణలో రాష్ట్రప్రభుత్వం తీవ్రమైన నిర్లక్ష్యం చేస్తుందని మండిపడ్డారు. కనీసం గోనె సంచులను రైతాంగానికి అందించడంలో విఫలమవుతుందన్నారు. తేమ శాతం పేరుతోనూ, ధాన్యం రంగు మారిందని, తాలు, తప్పలు ఉన్నాయని ధాన్యం కొనుగోలు చేయకుండా అనేక కొర్రీలు పెడుతున్నారన్నారు. కనీసం పంటను ఆరబెట్టుకోవడానికి, తడవకుండా కాపాడుకోవడానికి పట్టాలు కూడా ఇవ్వడం లేదు అని, కొనుగోలు కేంద్రం, రైతు సేవ కేంద్రం, రవాణా ఇన్ చార్జిలు, కస్టోడియన్ ఆఫీసర్లు రైస్ మిల్లర్స్ కుమ్మక్కైధాన్యం దళారులకు అమ్ముకునే విధంగా వ్యవహరిస్తున్నరన్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు వై ఆనందమోహన్, ఉప్పుటూరి మాధవరావు, చేవూరు దుర్గాప్రసాద్, బొల్లోజుల బాల బ్రహ్మాచారి, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కౌశల్ విజేతలకు అభినందనలు

విశాలాంధ్ర-ముత్తుకూరు: జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల బ్రహ్మదేవం లో చదువుతున్న 8వ తరగతికి చెందిన చిలకపాటి నిహారిక, 9వ తరగతి చెందిన మన్నేపల్లి శ్రీ చందన్ పవన్ విద్యార్థులు నవంబర్ 28వ తేదీ జిల్లాస్థాయి లో జరిగిన కౌశల్ క్విజ్ ఆన్లైన్ కాంపిటీషన్లో విజేతలుగా నిలిచారు. డిసెంబర్ 27వ తేదీ తిరుపతిలో జరగబోవు కౌశల్ రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలకు ఎంపిక అయిన సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు టాన్యా విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రస్థాయికి బ్రహ్మదేవం విద్యార్థులు ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉన్నదని, తిరుపతిలో జరుగుతున్న రాష్ట్రస్థాయి పోటీలలో కూడా ప్రథమ స్థానంలో నిలవాలని ప్రోత్సహించారు. విద్యార్థులకు శిక్షణను ఇచ్చిన గైడ్ టీచర్ ఫణికుమార్ ను, ఉపాధ్యాయులు షాయినా పర్వీన్, మహేష్ రెడ్డి, తిరుపాలు, వారిని ప్రోత్సహించిన ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులందరిని అభినందించారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

విశాలాంధ్ర-కలువాయి: కలువాయి మండలంలోని చింతలత్మకూరువిద్యుత్ సబ్‌స్టేషన్ లో, లోడ్ అధికముగా ఉండడం వల్ల ముందు జాగ్రత్త చర్యగా అదనపు లోడ్ వినియోగం కోసం సుమారు 60 లక్షలు వ్యయం తో నూతనం గా 5 ఎం వి ఏ పవర్ ట్రాన్సఫార్మర్ ను బుధవారం ఏర్పాటు చేశారు. దీని వలన రాబోవు వేసవి లో చింతల త్మకూరు, వేరుబొట్ల పల్లె, నాగల వెల్లటూరు, కాకివాయి, చిబినాపీ, తదితర గ్రామాలకు ఎటువంటి అధిక లోడ్ సమస్యలు లేకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా జరుగుతుందని విద్యుత్ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు రూరల్ ఈఈ లక్ష్మీ నారాయణ, డిప్యూటీ ఈ ఈ సురేష్, ఏఈ జై కుమార్ పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని డ్రగ్స్ రహిత సమాజంగా నిర్మిద్దాం

విశాలాంధ్ర-నెల్లూరు సిటీ: నెల్లూరు జిల్లా తోపాటు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాన్ని డ్రగ్స్ రహిత సమాజంగా నిర్మిద్దాం జనవిజ్ఞాన వేదిక నాయకులు వెల్లడించారు. బుధవారం నెల్లూరు జిల్లా జర్నలిస్టు జర్నలిస్ట్ భవన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జేవీవీ జిల్లా అధ్యక్షులు ఎం.వీ. చలపతి మాట్లాడుతూ నెల్లూరు జిల్లాలో డ్రగ్స్, గంజాయి లాంటి మత్తు పదార్థాలు వినియాగంతో యువత పక్క దారి పడుతున్నారు. ఇటీవల కాలంలో గంజాయి మాఫియాకు బలి అయిన సంఘటనలు చూస్తే ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలోనే శుక్రవారం, ఉదయం 10 గంటలకు షుమారు వెయ్యి మంది విద్యార్థులకు నగరంలోని కస్తూర్బా కళాక్షేత్రంలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నాం. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, జిల్లా ఎస్పీ అజిత వేజండ్ల, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ కె.లక్ష్మణ్ రావు పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో జేవీవీ నాయకులు శీను నాయక్, జేవీవీ గౌరవ అధ్యక్షులు రఫీ, జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి, విజయకుమార్, నగర ప్రధాన కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

జీకే పంజాబీ డాబాను ప్రారంభించిన టిడిపి పట్టణ అధ్యక్షులు

విశాలాంధ్ర-ఆత్మకూరు: ఆత్మకూర్ పట్టణ పరిధిలోని నెల్లూరు ముంబై జాతీయ రహదారిపై పట్టణ మాజీ కౌన్సిలర్ శ్రీకాంత్ మిత్రబృందం ఆధ్వర్యంలో జీకే పంజాబీ డాబాను ప్రారంభించారు. ఈ ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు తుమ్మల చంద్రారెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ కేతా వేణుగోపాల్ రెడ్డి, టిడిపి నేతలు కేతా విజయభాస్కర్ రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ గుండాల బుజ్జిరెడ్డి, టిడిపియువ నాయకులు పిడికిటి.వెంకటేశ్వర్లు, నెల్లూరు శివారెడ్డి, ఆత్మకూరు నాగయ్య అజ్జర్, బాబు తదితరులు హాజరయ్యారు. డాబా నిర్వాహకులైన మాజీ వార్డ్ కౌన్సిలర్ బొగ్గవరపు. శ్రీకాంత్, మనోజ్, సునీల్, కృష్ణ, పవన్, మహేంద్ర హరికృష్ణ వారి మిత్రబృందం పర్యవేక్షణ చేశారు.

పల్స్ పోలియోను విజయవంతం చేయండి

విశాలాంధ్ర-ఉదయగిరి: మండ లంలో ఈనెల21, 22, 23 తేదీల్లో జరిగే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గండి పాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని శివ కల్పన పేర్కొన్నారు. బుధవారం స్థానిక పట్టణంలోని పాత సామాజిక ఆరోగ్య కేంద్రం భవనంలో పల్స్ పోలియో కార్యక్రమం పై అంగన్వాడి, ఆశ, వైద్య సిబ్బందితో రీ ఓరియంటేషన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ శివ కల్పన మాట్లాడుతూ ఈనెల 21వ తేదీన మండలంలోని గ్రామాల్లో నిర్దేశించిన కేంద్రాల్లో 0-5 సంవత్సరాల్లోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయడం జరుగుతుందన్నారు. 22, 23 తేదీల్లో ఇంటింటా తిరిగి మొదటి రోజు పోలియో చుక్కలు వేయించుకొని చిన్నారులకు తప్పనిసరిగా చుక్కలను వేయాలన్నారు. పల్స్ పోలియో కార్యక్రమం పై గ్రామాల్లో ముందు రోజు ప్రజలకు అవగాహన కల్పించేలా ప్రచారం చేయాలన్నారు. అత్యవసర ప్రాంతాలను గుర్తించి అక్కడ ఉండే చిన్నారులకు పోలియో చుక్కలు అందేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ శివకుమారి, సూపర్వైజర్లు చెన్నయ్య, అంకమ్మ, టీబీ పర్యవేక్షకుడు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

స్నేహలత ఆదరణ కూడికలో పాల్గొన్న ఎమ్మెల్యే

విశాలాంధ్ర-బిట్రగుంట: బోగోలు ఐటీడీపీ అధ్యక్షుడు గోచిపాతల సందీప్ (సంజయ్) తల్లి గోచిపాతల స్నేహలత ఇటీవల అనారోగ్యంతో కన్నుమూయడంతో బోగోలు మేజరు పంచాయతీ, బేతనీయపేటలో బుధవారం నిర్వహించిన ఆదరణ- స్తుతి కూడిక కార్యక్రమానికి కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి హాజరయ్యారు. స్నేహలత చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులు, బంధువులను పరామర్శించి అండగా ఉంటామని ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి హామీఇచ్చారు. స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలి

విశాలాంధ్ర-జలదంకి: కావలి న్యాయస్థానాల న్యాయమూర్తుల ఆధ్వర్యంలో ఈ నెల 13న జరిగే జాతీయ మెగా లోక్ అదాలత్ సేవలను వినియోగించుకోవాలని కక్షిదారులకు లోకఅదాలత్ సభ్యులు ఎం.మాలకొండారెడ్డి తెలిపారు. కోర్టుకు రాని కేసులు పెండింగ్ కేసులు ఖర్చు కాలయాపన లేని అప్పీల్ లేని అంతిమ తీర్పులను లోక్ అదాలత్ లో ఇవ్వటం జరుగుతుందన్నారు. ఈ మెగా జాతీయ లోక ఆధాలత్ లో కొండాపురం, జలదంకి, కలిగిరి, కావలి, బోగోలు, మండలాల నుండి కక్షిదారులు సత్వర న్యాయం కొరకు ఈ లోక్ అదాలత్ సేవలను వినియోగించుకొని ప్రశాంతంగా జీవించాలని విజ్ఞప్తి చేశారు.

ముగ్గురు పేకాట రాయుళ్ళు అరెస్ట్

విశాలాంధ్ర-వలేటివారిపాలెం: వలేటివారిపాలెం మండలం లోని మండలకేంద్రం అయిన వలేటివారిపాలెం ఎస్ టీ కాలనీలో పేకాట ఆడుతున్నారని ఎస్ ఐ మరిడి నాయుడు కి రాబడిన సమాచారం మేరకు బుధవారం ఉదయం ఎస్ ఐ మరిడి నాయుడు వారి సిబ్బంది వలేటివారిపాలెం ఎస్ టీ కాలనీలో పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను పట్టుకున్నారు. వారి వద్ద నుండి 11,720 రూపాయలు డబ్బులు స్వాధీనం చేసుకొని వాటిని సీజ్ చేసినట్లు ఎస్ఐ మరిడి నాయుడు తెలియజేశారు.

కోటి సంతకాల సేకరణ విజయవంతం

విశాలాంధ్ర-కందుకూరు: ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల ప్రజా ఉద్యమం లో భాగంగా కందుకూరు నియోజకవర్గం లోని వై.యస్. ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు సమన్వయకర్త బుర్రా మధుసూదన్ యాదవ్ ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సంతకాల సేకరణ పత్రాలను పార్టీ జిల్లా కార్యాలయానికి ర్యాలీగా తరలించారు. ఇంచార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ జండా ఊపి సంతకాలు సేకరణ పత్రాలు తరలించే వాహనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా సంతకాలు సేకరించడం జరిగిందన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయడంపై ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని ప్రైవేటీకరణ జరగకుండా ప్రభుత్వంపై వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ ఒత్తిడి తీసుకొస్తుంది అని అన్నారు. సంతకాలు చేసిన నియోజకవర్గ ప్రజలందరికీ, సంతకాల సేకరణకు సహకరించిన వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ కందుకూరు నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు షేక్ రఫీ, కందుకూరు మండలం అధ్యక్షులు ఈదర రమేష్, వలేటివారిపాలెం మండలం అధ్యక్షుడు అనుమోలు లక్ష్మీనరసింహం, లింగసముద్రం మండలం అధ్యక్షులు నోటి వెంకటేశ్వర్లు, ఉలవపాడు మండలం అధ్యక్షులు నన్నం పోతురాజు, రాష్ట్ర బూత్ కమిటీ కార్యదర్శి గణేశం గంగిరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి ముప్పవరపు కిషోర్, జిల్లా ఇంటలెక్చువల్ ఫోరం అధ్యక్షులు రావులకొల్లు బ్రహ్మానందం, జిల్లా కల్చరల్ విభాగం అధ్యక్షులు సాంబశివరావు, జిల్లా వైస్ ప్రెసిడెంట్ బిల్లా రమణయ్య, రాష్ట్ర కల్చరల్ వింగ్ అధికార ప్రతినిధి వల్లూరి కోటేశ్వరరావు, రాష్ట్ర బీసీ సెల్ విభాగం సెక్రెటరీ పెయ్యాల రమేష్, గుడ్లూరు ఎంపీపీ పులి రమేష్, కందుకూరు నియోజకవర్గం గ్రీవెన్స్ సెల్ అధ్యక్షులు యారమాల నాగభూషణం, కందుకూరు పట్టణ ఉపాధ్యక్షులు తల్లపనేని గోపి, కందుకూరు నియోజకవర్గం రైతు విభాగం అధ్యక్షులు నలమోతు చంద్రమౌళి, జిల్లా సెక్రెటరీ విభాగం అధ్యక్షులు పాశం కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

73 వేల సంతకాలు సేకరణ

విశాలాంధ్ర-బ్యూరో నెల్లూరు: నెల్లూరు రాంజీ నగర్ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నగర నియోజకవర్గ కార్యాలయంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్ఆర్సిపి చేపట్టిన కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమం కార్యక్రమంలో.. భాగంగా నెల్లూరు నగర నియోజకవర్గంలో పూర్తి చేసిన సంతకాల కాపీల వాహనాన్ని.. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలతోలి కలిసి.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు సిటీ ఇంచార్జ్ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి పార్టీ పరిశీలకులు చిలకలూరు సుధీర్ రెడ్డి జెండా ఊపి.. జిల్లా పార్టీ కార్యాలయానికి పంపారు. ఈ కార్యక్రమంలో.. సుమారు 500 మంది వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు.. ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి తో కలిసి వాహనం వెంట ర్యాలీగా తరలి వెళ్లారు. రాంజీ నగర్ నుంచి .. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నేతల.. భారీ జన సందోహం మధ్య సాగిన ర్యాలీ ధర్మాధపురం సర్కిల్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరించడాన్ని వ్యతిరేకిస్తూ..ప్రజలు పార్టీలకతీతంగా ముందుకొచ్చి.. కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమానికి.. మద్దతు పలికారని తెలిపారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో విసిగిపోయిన ప్రజలు.. కోటి సంతకాల ప్రజా ఉద్యమాన్ని ముందుండి నడిపించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

టీకాలు అనేక ప్రాణాంతక వ్యాధుల నుండి రక్షణ కల్పిస్తాయి

విశాలాంధ్ర-కావలి: చెన్నాయిపాలెం పాములు గుంట పాలెంలోని ప్రాథమిక పాఠశాలలో ఇమ్యునైజేషన్ కార్యక్రమంలో భాగంగా బాలలకు, గర్భవతులకు వ్యాక్సినేషన్, ఆరోగ్య అవగాహన సర్వాయిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో డాక్టర్ రామ్ సెంటర్ విశ్వోదయ సహకారంతో వైద్య శిబిరం జరిగింది. ఈసందర్భంగా డాక్టర్ పి. ప్రతిమ మాట్లాడుతూ బాలలకు, బాలింతలకు వేసే టీకాలు షెడ్యూల్ ప్రకారం వేయించాలని, ఈ టీకాలు అనేక ప్రాణాంతక వ్యాధుల నుండి రక్షణ కల్పిస్తాయని,రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేసి, ధనుర్వాతం, కోరింత దగ్గు, పోలియో, మీజిల్స్, గవదబిళ్ళలు, రుబెల్లా, తట్టు, న్యుమోనియా వంటి అనేక రకాల వ్యాధుల నుండి రక్షణ కల్పిస్తాయని తెలిపారు. తదుపరి వ్యాక్సినేషన్ కార్యక్రమం జరిగింది. డాక్టర్ రామ్ సెంటర్ వారు ఐరన్,పోలిక్, కాల్షియం సిరప్ లు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో డాక్టర్ రామ్ సెంటర్ చైర్మన్ దొడ్ల మనోహరరెడ్డి, డైరెక్టర్ కూనం తాతిరెడ్డి, ఎ.యన్.యంలు విజయమ్మ పరిమళ, ఎం సి హెచ్ పి సమత ఇన్సులేట్, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

అవినీతి నిరోధక చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

విశాలాంధ్ర-కావలి: సమాజంలో విద్యార్థులు యువత అవినీతి నిరోధక చట్టాలు పై అవగాహన పెంచుకొని అవినీతి రహిత సమాజం కొరకు కృషి చేయాలని కావలి లోక్ అదాలత్ సభ్యులు ఎం.మాలకొండ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం రాజువారి చింతలపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రపంచ అవినీతి వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అవినీతి నిరోధక చట్టాలపై అవగాహన సదస్సును నిర్వహించినారు. ఈ కార్యక్రమానికి అతిధులుగా లోక్ అదాలత్ సభ్యులు ఎం.మాలకొండ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ రోజురోజుకీ పెరుగుతున్న అవినీతిని నిర్మూలించడానికి పౌర సంస్థలు అధికారులు ప్రజాప్రతినిధులు నిరంతరం క ృషి చేయాలని కోరినారు. అవినీతి దేశ ప్రగతికి ప్రతిబంధకం అని కావున రాష్ట్రస్థాయిలో అవినీతిని నిర్మూలించడానికి లోకాయుక్త సహచట్టం సిబిసిఐడి ఉన్నాయని తెలిపినారు. జాతీయస్థాయిలో లోక్పాల్ సిబిఐ సివిసి లాంటి అవినీతి నిర్మూలించడానికి చట్టాలు ఉన్నాయని పేర్కొన్నారు. అవినీతి నిరోధక చట్టాలను పటిష్టంగా అమలుచేసి మహాత్మా గాంధీ కలలుగన్న అవినీతి రహిత సమాజాన్ని నిర్మించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరినారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు పొదిలి చంద్రశేఖర్ అధ్యక్షులు వహించి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విలువలతో ఉన్నత విద్యను అభ్యసించి దేశభక్తిని పెంచుకొని అవినీతిని నిరోధించడానికి కృషి చేయాలని కోరినారు ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త జయంపుకనకయ్య ఉపాధ్యాయులు విజయ విద్యార్థులు పాల్గొన్నారు.

కోటి సంతకాల ముగింపు కార్యక్రమం

విశాలాంధ్ర-ఉదయగిరి: రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ విధానాన్ని వ్యతిరేకిస్తూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పిలుపుమేరకు రాష్ట్రవ్యాప్తంగా వైఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ జరిగింది బుధవారం స్థానిక పట్టణంలోని వైయస్సార్ సర్కిల్ లో కోటి సంతకాల సేకరణ ముగింపు కార్యక్రమం జరిగింది. మొదటిగా స్థానిక నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్ రెడ్డి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి దివంగత నేత డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. నియోజకవర్గ స్థాయిలో దాదాపు 60 వేల పైన సంతకాలు సేకరించినట్లు ఆయన తెలిపారు. సేకరించిన సంతకాల పత్రాలను వైయస్సార్ కాంగ్రెస్ జిల్లా కార్యాలయానికి ప్రత్యేక వాహనంలో తరలించారు. ఈ కార్యక్రమంలో ఉదయగిరి మండల కన్వీనర్ రాజగోపాల్ రెడ్డి సీతారాంపురం మండలం కన్వీనర్ చింతమరెడ్డి సుబ్బారెడ్డి వింజమూరు జడ్పిటిసి గణపం బాలకృష్ణారెడ్డి మాజీ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ షేక్ అలీ అహ్మద్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు షేక్ దస్తగిరి అహ్మద్ వైఎస్ఆర్‌సీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర-ఆత్మకూరు: ఇటీవల వరుసగా వర్షాల కారణంగా తన వార్డు పరిధిలోని ప్రజలకు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ముందస్తుగా అవసరమైన వైద్య సేవలు అందించేందుకు 17వ వార్డులో వైద్య శిబిరాన్ని మున్సిపల్ వైస్ చైర్మన్ సర్దార్ ఏర్పాటు చేశారు. వైద్య శిబిరంలో వార్డులోని పలువురికి ఉన్న వివిధ వ్యాధులకు మందుల పంపిణీ చేశారు. మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి సూచనలతో మున్సిపల్ చైర్ పర్సన్ మరియు కమిషనర్ సహకారంతో ఈ వైద్య శిబిరాన్ని తన వార్డులో ఏర్పాటు చేసినట్లు సర్దార్ తెలిపారు.

మహిళ ఆత్మహత్య

విశాలాంధ్ర-కావలి: ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం కావలి పట్టణంలోనే వైకుంటపురం లో చోటు చేసుకుంది.దిలీప్, అనూష లు పదేళ్ల క్రితం వివాహం చేసుకొని వైకుంటపురంలో నివాసం ఉంటున్నారు. భార్య భర్తల మధ్య కలహాలు కారణంగా అనుష(28) ఆత్మహత్య చేసుకుంది. రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

దిత్వా తుఫానుతో నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి

సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నందిపోగు రమణయ్య

విశాలాంధ్ర-బ్యూరో నెల్లూరు: కోవూరు నియోజకవర్గంలో దిత్వా తుఫాను వలన నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని నియోజక వర్గం లోని అనేక గ్రామాలలో నెలకొని ఉన్న మౌలిక వసతుల కల్పన కోసం ప్రభుత్వ యంత్రాంగం కృషి చేయాలి అని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నందిపోగు రమణయ్య డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా మెంత దిత్వ తుఫాన్ల వలన నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని సిపిఐ, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఇచ్చిన పిలుపులో భాగంగా కోవూరులో ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ నుంచి తహసిల్దార్ ఆఫీస్ వరకు ర్యాలీ నిర్వహించి తాసిల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నంది పోగు రమణయ్య ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు పి.లీలా మోహన్ లు మాట్లాడుతూ జిల్లాలోప్రధానంగానియోజకవర్గంలో దిత్వ తుఫాను వలన చాలా గ్రామాలులో నార్లు పోసుకున్న రైతులకు వర్షాల కారణంగా నార్లు మొత్తం వరదలకు కొట్టుకుపోవడం వలన ప్రభుత్వ యంత్రాంగం కోవూరు నియోజకవర్గ వ్యాప్తంగా ఆయా గ్రామాలలో సర్వే నిర్వహించి రైతులకు తిరిగి నార్లు పోసుకునేందుకు విత్తనాలను పంపిణీ చేయవలసిందిగా డిమాండ్ చేశారు. అదేవిధంగా రామ్నాథ్ పురం లోని నెలకొని ఉన్న సిమెంట్ రోడ్లు ట్రాన్స్ఫార్మర్ అదే విధంగా గ్రామానికి ఆనుకొని పోతున్న వేగూరు కాలువకు మూడు అడుగుల రోడ్డును నిర్మించివరదలువచ్చినప్పుడు ఇబ్బంది పడుతున్న గ్రామాన్ని కాపాడాల్సిందిగా తహసిల్దార్‌కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఆయన సానుకూలంగా స్పందించి రేపే ఆ గ్రామాన్ని సందర్శిస్తానని అక్కడ ఉన్న సమస్యలను గుర్తించి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు అక్కడనుండి పంచాయతీ ఆఫీసు వద్దకు ర్యాలీగా వెళ్లి కొవూరులో ఉన్నటువంటి పెళ్లపూరు కాలనీలో స్కూలుకు చుట్టూ అపరిశుభ్రంగా ఉన్నటువంటి ప్రదేశాన్ని శుభ్రం చేయాలని అదేవిధంగా సైడ్ కాలువలు నిర్మించాలని ముఖ్యంగా అంగన్వాడి స్కూల్ దగ్గర ఉన్న సైడ్ కాలువకునాప రాళ్లు పరచాలని పంచాయతీ కార్యదర్శికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన అనేక హామీలను తుంగలో తొక్కి ప్రజలను మభ్య పెట్టడంతో పాటు జిల్లా రైతాంగాన్ని తీవ్రంగా వేధిస్తున్న యూరియా కొరతను అధికారులు గుర్తించి ప్రైవేట్ వ్యక్తులు బ్లాక్లో అమ్ముతున్న విధానాన్ని అరికట్టి అర్హులైన రైతులకు అందే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా కోవూరు నియోజకవర్గంలోని అనేక ప్రాంతాలలో కాలువ పూడికతీతలు తీసి కాలువలులో నీరు సరిగా ప్రవహించే విధంగా అధికార యంత్రాంగం చొరవ చూపాలని కోరారు. పై కార్యక్రమంలో ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షులు గుది విజయ్ కుమార్ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు దండూరి కామేశ్వరరావు లక్ష్మయ్య శ్రీనివాసులు రామానాయుడు విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

చెరువు తూములో అడ్డుగా గోడ కట్టిన గుర్తు తెలియని వ్యక్తులు

విశాలాంధ్ర-పొదలకూరు: పొదలకూరు-లింగంపల్లి చెరువు కింద సుమారు 100 ఎకరాల వరిసాగుకు రైతులు నారులు పోసుకొని ఉన్నారు, గత వారం కురిసిన వర్షాలకు మొత్తం భాగంలో రైతుల నారు కొట్టుకొని పోయి ఇబ్బందులకు గురవుతున్నారు, నీరు అవసరం ఉండి నీరు చెరువు తూము తెరవగా చెరువు నిండా నీరు వున్నా చుక్క నీరు బయటకు రాలేదు, దీంతో సమస్య ను గుర్తించేందుకు తూములోకి వెళ్ళి చూస్తే గుర్తు తెలియని వ్యక్తులు తూము లోపల నీరు బయటకు రాకుండా అడ్డుగా ఇటుకలతో గోడ కట్టివున్నారు, గోడ పగలకొట్టాలి అంటే నీటి ప్రవాహం ఎక్కువ కారణంగా ప్రాణాపాయం జరిగే ప్రమాదం ఉంది, కాన అధికారులు, నాయకులు స్పందించి రైతుల సమస్యను వెంటనే స్పందించి రైతులను ఆదుకోవాలని ఆయకట్టుదారులు కోరుతున్నారు.

రీలే నిరాహార దీక్షలో ఎస్‌విఎన్ హై స్కూల్ విద్యార్థులు

విశాలాంధ్ర-కలువాయి: కలువాయి మండలాన్ని నెల్లూరు జిల్లాలోని కొన సాగించాలంటూ కలువాయి మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్ నందు జెఏసి ఆధ్వర్యంలో రీలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ రీలే నిరాహార దీక్షకు మద్దతు తెలుపుతూ ఎస్ వి ఎన్ హై స్కూల్ విద్యార్థులు దీక్షలో పాల్గొని తిరుపతి వద్దు నెల్లూరు ముద్దు అంటూ నినాదాలు చేశారు. నెల్లూరు జిల్లాలో వున్న కలువాయి మండలాన్ని ఎక్కడో 150 కిలో మీటర్ల దూరంలో వున్న తిరుపతిలో కలపాలన్న నిర యం పై ప్రభుత్వం పునరాలోచన చేసి కలువాయి మండలాన్ని నెల్లూరు లోనే కొనసాగే చూడాలని లేదంటే ఈ ఉద్యమం ఇలానే కొనసాగుతుందని తెలిపారు. ఈ రిలే నిరాహారదీక్షకు వెంకటగిరి బిజెపి ఇంచార్జ్ ఎస్ఎస్ఆర్ నాయుడు. అంగన్వాడి టీచర్లు, పొదుపు వివోఎలు, సంఘీభావం తెలిపారు. మండల కూటమి నాయకులు, జెఏసి సభ్యయులు, ఉపాధ్యాయ సంఘాలు, హై స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ కు అంతరాయం

విశాలాంధ్ర-ఉలవపాడు: గురువారం 132/33 కే. వి మన్నేటికోట సబ్ స్టేషన్ నుండి ఉలవపాడు మండలంలోని అన్ని సబ్ స్టేషన్ లకు వచ్చే 33 కే. వి భీమవరం ఫీడర్ మరమ్మతు నిమిత్తం ఉలవపాడు మండలంలోని అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు నిలిపివేయబడును. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సింగరాయకొండ సబ్ డివిజన్.వారు ఒక ప్రకటన లో తెలిపారు.

మండలాల విభజనతో సర్వేపల్లి నియోజకవర్గ ప్రజలకు నష్టం

విశాలాంధ్ర-పొదలకూరు: మండలాల విభజన వలన జరిగే నష్టం పై సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి కి బిజెపి నేతలు మిడతల రమేష్, నరాల సుబ్బారెడ్డి లు బుధవారం విజ్ఞప్తి చేశారు. రాపూరు మండలం విభజనలో కండలేరు డ్యామ్‌ను కోల్పోతామన్నారు. దాని ప్రభావం పొదలకూరు, మనుబోలు మండలాలపై నష్ట ప్రభావం ఎక్కువగా ఉంటుందన్నారు. కండలేరు డ్యామ్‌లో- లెవెల్ కెనాల్ మీద ఆధార పడిన పులికల్లు, వామింటపర్తి, దేగపూడి, ఇనుకుర్తి, కొనగలురు, రామాపురం, ముదిగేడు, దేవర వేమూరు, బిరదవోలు, బ్రాహ్మణపల్లి, మనుబోలు మండలంలోని రాజోలుపాడు, చెర్లోపల్లి, వీరంపల్లి, మడమానూరు, మనుబోలు, బద్వేలు, పిడూరు, పిడురుపాలెం, కొలనుకుదురు, వెంకన్నపాలెం, కటువపల్లి, బండేపల్లిగ్రామాల రైతులు కరువు సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని పేర్కొన్నారు. హై లెవెల్ కెనాల్ నుండి నీరు అందే గాలిపాలెం, ఎర్రగుంటపాలెం, మొగులూరు, కనుపర్తి, అల్లుర్తి,పొదలకూరు, తోడేరు, అయ్యగారు పాలెం, మరుపూరు, గ్రామాలు.వెంకటాచల మండలంలోని పాలిచెర్లపాడు, కందలపాడు గ్రామాలలో కరువు సమయంలో నీటి ఎద్దడి తప్పనిసరిగా ఏర్పడుతుందన్నారు. నీటి లభ్యత తక్కువగా ఉన్నప్పుడు రాయలసీమ తెలంగాణ కాలువలకు నీరు విడుదల చేసే రాజోలు బండ డైవర్షన్ వద్ద రాయలసీమ తెలంగాణ రైతుల పోలీసులు మోహరింపు చూస్తూనే ఉన్నామన్నారు. అశాస్త్రీయ మండలాల విభజన వలన కండలేరు ముంపు నిరుద్యోగుల సమస్య జనులమవుతుందన్నారు. నెల్లూరు జిల్లా నుండి మండలాలు విభజన జరగకుండా ప్రభుత్వ పెద్దలకు వివరించాలని వారు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు.

గ్రంధాలయాన్ని సందర్శించిన గుడ్ షెఫర్డ్ విద్యార్థులు

విశాలాంధ్ర-రాపూరు: రాపూరులోని గ్రంథాలయాన్ని రాపూరు లోని గుడ్ షెఫర్డ్ విద్యార్థులు బుధవారం సందర్శించి గ్రంథాలయంలోని వివిధ రకాలైన పుస్తకాలు మరియు దిన పత్రికలు చదవడం అందులో ఉండే విశేషాలు క్లుప్తంగా తెలుసుకొనవడం జరిగింది రాబోయే భవిష్యత్తు తరాలకు గ్రంథాలయం మీద అవగాహన మరియు ఉపయోగాలు తెలుసు కోవాలని గ్రంథాలయ అధికారి ఏ అంజయ్య విద్యార్థులకు చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రంథాలయ సహాయకుడు కే.వెంకటేశ్వర్లు విద్యార్థులు పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా వుండాలి: రూరల్ డిఎస్‌పి

విశాలాంధ్ర-బ్యూరో నెల్లూరు: గంజాయి, డ్రగ్స్ మాఫియాని కూకటి వేళ్లతో పెకిలించాలి మత్తుపదార్థాలకువ్యతిరేకంగా అఖిలభారత యువజన సమాఖ్య ముద్రించిన పోస్టర్లు నెల్లూరు రూరల్ డిఎస్పి పోస్టర్ విడుదల చేయడం జరిగింది. ఈ సందరరేగా డిఎస్పి మాట్లాడుతూ మత్తు పదార్థాలపై గంజాయి పై ప్రజలు పోలీసులకు సహకరిస్తే గంజాయి వంటి మత్తు పదార్థాలు లేకుండా చేస్తామని అన్నారు అవసరమైతే 112 కి కాల్ చేసి ఫిర్యాదు చేయగలరని డిఎస్పి శ్రీనివాస రావు చెప్పారు చెప్పారు. ఏవైఎఫ్ నెల్లూరు జిల్లా కార్యదర్శి షేక్ మున్న మాట్లాడుతూ రాష్ట్రంలో విపరీతంగా గంజాయి వాడకం కొనసాగుతోంది అని, దాన్ని అరికట్టడంలో ప్రభుత్వం, అధికారులు ఎంత ప్రయత్నిస్తున్నా నివారించలేని స్థితిలోకి మత్తు పదార్థాల వాడకంపెరిగి పోయిందని, దీన్ని పూర్తిగా అరికట్టాలంటేప్రభుత్వం,అధికారులే కాకుండా ప్రజల భాగస్వామ్యం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రపంచంలోనే యువత ఎక్కువగా ఉన్న దేశాలలో భారత దేశం మొదటి స్థానంలో వుందని, ఏ దేశంలో అయితే యువత ఎక్కువగా వుంటుందో ఆ దేశం అన్ని విధాల అభివృద్ధి పథంలోకిదూసుకెళుతుందని, దురదృష్టవ శాత్తూ మనదేశంలో ఆ పరిస్థితులు లేకపోవడం చాలా బాధాకరమన్నారు. దీనికి కారణం గంజాయి, డ్రగ్స్, మద్యం లాంటి మత్తు పదార్థాలకు యువత బానిసై తమ ఆరోగ్యకరమైన ఆలోచనలను చంపుకొని, అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడుతోంద న్నారు. మత్తు పదార్థాల వాడకం వల్ల మెదడులోని చైతన్య వంతమైన కణాలు క్షీణించి, మంచి గా ఆలోచించే సామర్థ్యం తగ్గిపోయి, సమాజానికి కీడు కలిగించే ధోరణి అలవడుతుం దన్నారు. ముఖ్యంగా సమాజంలొ జరుగుతున్నఅవినీతి,అక్రమాల పై ప్రశ్నించే తత్వం కొరవడి, ఈ దేశ అభివృద్ధికి ఉపయోగ పడాల్సిన యువత మత్తులో జోగుతొండడం చాలా బాధకరమన్నారు. ముఖ్యంగా ఇలాంటి అంశాలపై ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, అలాంటి అసాంఘిక కార్యకలాపాల కు వ్యతిరేకంగా ఎవరైనా గళం విప్పితే వారిమీద కూడా దాడులు చేస్తున్నారు అని నెల్లూరులో జరిగిన వరుస హత్యలే దీనికి ఉదాహరణ అని అన్నారు. భవిషత్ లో అఖిల భారత యువజన సమాఖ్య ఆధ్వర్యలో పోలీసు అధికారుల సహకారంతో అవగాహనాసదస్సులు నిర్వహించి, యువకుల్లో మత్తును వదిలించి, మంచి ఆలోచన, ఆరోగ్యవంతులుగా ఉండడానికి యువజన సమాఖ్యనిరంతరం కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్రృమంలో ఏఐవైఎఫ్ నాయకులు భాష, మనోహర్, మీరాఖాజా పాల్గొన్నారు.

రాపూరు తహసీల్దారు కార్యాలయంలో పలు కీలక రికార్డులు మాయం

విశాలాంధ్ర-రాపూరు: రాపూరు మండల తహసీల్దారు కార్యాలయంనందు, పలు కీలక రికార్డులు మాయం అయ్యాయని ఆర్ఐ రవి తేజకి ఎంఆర్ఓ కార్యాలయంలో వినతి పత్రం అందజేసిన ఏపి ఎంఆర్పిఎస్ రాష్ట్ర కార్యదర్శి, కొండాపురం వెంకటేశ్వర్లు. ఈ సందర్భంగా కొండాపురం మిడియాతో మాట్లాడుతూ రాపూరు రెవిన్యూ ఆఫీస్ నందు పలు రికార్డులు, ఇంతకముందు ఉన్న అధికారులు పేద ప్రజలు కు ఇచ్చిన నివేశన స్థలాల పట్టాలు, భూమికి సంబంధించిన, అడంగల్ 1బి, 10,1, డిరిజిస్టర్, నకళ్లు, ఇతర భూ సర్వే నెంబర్లు సంబందించిన కాపీలు, మొదలగునవి, 2005 సమాచార హక్కుల చట్టం అడిగిన, సకాలంలో సమాచారం ఇవ్వాలి. అలాకాకుండా, 5, 10, నెలలు గడుపుతూ, రికార్డులులో సర్వే నెంబర్లు, సబ్ డివిజన్ నెంబర్ లు, కొన్ని మార్చివ్వడం జరుగుతుంది. అదేవిధంగా ప్రభుత్వం భూములు కు సంబందించిన రికార్డ్ స్టేటస్ ప్రస్తుతం ఏమిటీ అని, గతం లో కొందరు రాపూరు ప్రెస్ వారికి, మరి కొందరు పేదల కు, కొందరు స్థానికేతరులకు, ఇంటి నివాశం కొరకు పొజిషన్ సర్టిఫికెట్‌లు ఇచ్చి ఉన్నారు అని, ఆర్టిఐ యాక్ట్ ద్వారా అడిగితే, మీరు అడిగిన సమాచారం, మా ఆఫీస్ నందు లభ్యం కాలేదు, అని సమాచార అధికారులు చెపుతున్నారు. ఇంతకు ముందు ఉన్నా రెవిన్యూ రికార్డులు, ఇప్పుడు ఏమైనట్లు, అదేవిధంగా ఇక్కడ కొందరి పేద ప్రజలు భూ, రికార్డులు, సర్వే నెంబర్లు మార్చి, ప్రభుత్వ భూముల్లో, అక్రమ లే అవుట్లు వేసి వ్యాపారం చేస్తుంటే, చోద్యం చూస్తూ ఉండటం, రాపూరు, రెవిన్యూ అధికారులు కొందరు పరిస్థితి. ఈ విషయం గూర్చి, జిల్లా రెవిన్యూ అధికారులు విచారణ చేసి, రాపూరు ప్రాంత వాసులకు సమా ధానం చెప్పి, న్యాయం చేయండని. కొండాపురం వెంకటేశ్వర్లు తెలియజేసారు.

6 హెల్త్ క్లినిక్‌ల నిర్మాణానికి రూ.2.87 కోట్లు మంజూరు

ఎమ్మెల్యే కురుగొండ్లకు కృతజ్ఞతలు తెలిపిన జిల్లా టిడిపి నాయకులు

విశాలాంధ్ర-రాపూరు: రాపూరు మండలంలో కొత్తగా అకిలీవలస, సిద్ద వరం, శానయపాలెం, పంచాయతీ లలో నూతన హెల్త్ క్లినిక్ నిర్మాణాని కి ఒక్కోదానికి 36 లక్షల రూపాయలు చొప్పున, మండలంలో అసంపూర్తిగా ఉన్న సైదాదుపల్లి, బొజ్జనపల్లి, నెల్లెపల్లి హెల్త్ క్లినిక్ భవన నిర్మాణా లకు 30 లక్షలు 27 లక్షలు 22 లక్షల చొప్పున మొత్తం ఆరు భవనాలకు సంబంధించి ఒక కోటి 87 లక్షల రూపాయల నిధులను 15వ ఆర్థిక సంఘం నిధుల నుండి విడుదల చేయించిన వెంకటగిరి నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత వేంకటగిరి శాసనసభ్యులు కురుగొండ్ల రామ కృష్ణకి రాపూరు మండల ప్రజానీకా నికం తరపున ప్రత్యేక ధన్య వాదాలు తెలియజేస్తున్నామని రాపూరు మండల తెలుగుదేశం ప్రముఖులు ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోన దేవస్థాన పాలకవర్గ మాజీ చెర్మన్ చెన్ను తిరిపాల్ రెడ్డి మరియు తెలుగు దేశం మండల అధ్యక్షులు చెన్ను అశోక్ రెడ్డి తెలిపారు.

ఉప్పు చెరువు ప్రాంత నివాసులకు న్యాయం చేయాలి

విశాలాంధ్ర-కందుకూరు: కందుకూరు పట్టణంలోని ఉప్పు చెరువు ప్రాంతంలో నివసిస్తున్న ప్రజల రోడ్డునుఆ ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకొని ఆ ప్రాంత ప్రజలకు రోడ్డు నిర్మాణాలు చేపట్టి వారికి కనీస వసతులను ఏర్పాటు చేయాలని సిపిఐ కందుకూరు నియోజకవర్గ కార్యదర్శి బూసి సురేష్ బాబు తెలిపారు. బుధవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఉప్పు చెరువు ప్రాంత కాలనీవాసులతో కలిసి సబ్ కలెక్టర్ దామెర హిమ వంశీ కి వింత పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప్పు చెరువు ప్రాంతంలో దాదాపు 20 సంవత్సరాల నుండి నివాసముంటున్న ప్రజలకు రోడ్డు మార్గం లేకుండా కొందరు ఆక్రమణ చేసి వారికి ఇబ్బందులు కలిగిస్తూ అడ్డుకున్న వారిపై ఆక్రమణదారులు దాడి చేసిన సంఘటన జరిగిందని, అది సరైన పద్ధతి కాదని ఆయన మండిపడ్డారు. ఇరిగేషన్ కు సంబంధించిన ఉప్పు చెరువు పోరంబోకు స్థలాన్ని ఆక్రమించుకొని ప్రైవేటు వ్యక్తులు ఎలా వెంచర్లు వేస్తున్నారని, అక్రమంగా వెంచర్లు వేసి ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమిస్తున్న వారిపై అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఆయన ప్రశ్నించారు. బహిరంగంగానే స్థలాలు ఆక్రమణలు జరుగుతుంటే మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి నిమ్మకు నీరేత్తినట్లు ఉన్నారని ఆయన మండిపడ్డారు. ధనవంతులకు ఒకలా పేదవారికి ఒకలా మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి వ్యవహరిస్తున్నారని ఆయన అన్నారు. మున్సిపల్ అధికారులు సైతం మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న అన్ని ఆక్రమణలు ఎందుకు అడ్డుకోవడం లేదని ఆయన ప్రశ్నించారు. ఉప్పుచెరువు ప్రాంతంలో నివశిస్తున్న ప్రజలకు న్యాయం జరిగేలా చూడాలని ఆయన కోరారు. లేనిపక్షంలో ఆ ప్రాంత స్థానికులతో కలిసి సిపిఐ పోరాటం చేస్తుందని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు యర్రంశెట్టి ఆనందమోహన్, చేవూరి దుర్గాప్రసాద్, ఉప్పుటూరి మాధవరావు, బొల్లోజుల బాల బ్రహ్మచారి కోటేశ్వరరావు ఉప్పు చెరువు ప్రాంత స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ పై వరి విత్తనాల పంపిణీ

విశాలాంధ్ర-పొదలకూరు: మండలంలోని మరుపూరు గ్రామంలో జిల్లా వ్యవసాయ అధికారిణి పి.సత్యవాణి ఆధ్వర్యంలో ఇటీవల దిత్వా తుఫానుకు దెబ్బ తిన్న నారుమడి రైతులకు 80%సబ్సిడీ పై వరి విత్తనాలను అందించారు. 25 కేజీల వరి విత్తనాల పూర్తి ఖరీదు 1070 రూపాయలు కాగా ప్రభుత్వం సబ్సిడీ 855 రూపాయలు, రైతు వాటా 215 రూపాయలు . పొదలకూరు మండలం లో వరి పంట నష్టపోయిన రైతులు తమ ఆధార్,పొలం పాస్ పుస్తకంతో మీ దగ్గర లోని రైతు సేవ కేంద్రం సిబ్బందిని సంపాదించాలని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మరుపూరు ఛాంపియన్ రైతు శ్రీనివాసులు రెడ్డి కి వంద శాతం రాయితీ పై ముడి జింక్ 10 కేజీలు, బోరాను 1 కేజీ, అలాగే 1 కేజీ చిలేటెడ్ జింకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సహాయకులు కె.శివ నాయక్, పొదలకూరు సొసైటీ చైర్మన్ తలచీరు మస్తాన్ బాబు, మండల వ్యవసాయ అధికారి వి.ప్రతాప్,మల్లికార్జున యాదవ్, శ్రీనివాసులు రెడ్డి,ప్రభాకర్ రెడ్డి,పులిపాటి. వెంకటరత్నం నాయుడు, నెట్టెం పెంచలయ్య, గ్రామ వ్యవసాయ సహాయకులు శివా రెడ్డి, రైతులు రమణయ్య, వెంకట సుబ్బయ్య, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రసాద్ నాయుడు ఉత్తర క్రియల్లో ఎంఎల్ఏ కావ్య

విశాలాంధ్ర-జలదంకి: గట్టుపల్లి చింతలపాలెం టిడిపి నాయకులు గొట్టిపాటి ప్రసాద్ నాయుడు ఉత్తర క్రియలు బుధవారం జరిగాయి. కార్యక్రమంలో కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి పాల్గొన్నారు. ప్రసాద్ నాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

రెడ్ క్రాస్‌కు ఒక లక్ష రూపాయలు విరాళం

విశాలాంధ్ర-కావలి: డాక్టర్ బెజవాడ రవికుమార్, డాక్టర్ విజయలు ఆదర్శ దంపతులని కావలి రెడ్ క్రాస్ చైర్మన్ డి రవిప్రకాష్ పేర్కొన్నారు. డాక్టర్ రవి డాక్టర్ విజయ దంపతుల 43వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా కావలి రెడ్ క్రాస్ పాలకమండలి సభ్యులు, రెడ్ క్రాస్ సిబ్బంది వారిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవికుమార్, డాక్టర్ విజయ దంపతులు అభ్యుదయ భావాలతో తమ వృత్తిని, ప్రవృత్తిని కొనసాగిస్తున్నారని అన్నారు. డాక్టర్ రవికుమార్ పట్టణంలోని పలు సేవా, సాంస్కృతిక, క్రీడా సంస్థలకు అధ్యక్షులుగా వ్యవహరిస్తూ, వాటి అభివృద్ధికి తోట్పాటు అందిస్తున్నారని పేర్కొన్నారు. కావలి రెడ్ క్రాస్ రక్తకేంద్రంలో కాంపొనెంట్ బ్లాక్ మరియు తలసేమియా డే కేర్ సెంటర్ ఏర్పాటుకు విశేషకృషి చేసారని అన్నారు. వైస్ చైర్మన్ కె.హరినారప రెడ్డి మాట్లాడుతూ, డాక్టర్ రవి, డాక్టర్ విజయ దంపతులు నమ్మిన సిద్ధాంతం జీవితాంతం కొనసాగిస్తున్నారన్నారు. రవి విజయ దంపతులు లక్ష రూపాయలు విరాళం, తలసేమియా డే కేర్ సెంటర్ నిర్వహణ నిమిత్తం కోశాధికారి మధుసూదనరావు కు అందజేశారు. డాక్టర్ రవికుమార్ మాట్లాడుతూ, కావలి రెడ్ క్రాస్ లో త్వరలో కాన్సర్ అవగాహన, నిర్ధారణ, నివారణ కేంద్రం ఏర్పాటుచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ పాలకమండలి సభ్యులు మద్దుల నరసింహారావు, డాక్టర్ పామూరు శ్రీధర్, డాక్టర్ రమ్య, జనిగర్ల మనోహర్, నల్లిపోగు ప్రణీత్, బెజవాడ ప్రసన్నకుమార్, జిల్లా పాలకమండలి సభ్యులు కలికి శ్రీహరి రెడ్డి, జూనియర్ రెడ్ క్రాస్ కన్వీనర్ గాదిరెడ్డి హరనాథ్ పాల్గొన్నారు.

పొగాకులో సస్యరక్షణపై రైతులకు శిక్షణ

విశాలాంధ్ర-లింగసముద్రం: పొగాకు బోర్డు కందుకూరు రెండవ వేలం కేంద్రం విఆర్ కోట గ్రామంలో రైతులుకు పొగాకు పంటలో పాటించవలసిన సస్య రక్షణ చర్యలు, రసాయన అవశేష నిర్మూలన, ఎన్‌టిఆర్‌ఎం నిర్మూలన మీద శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో 27వ వేలం నిర్వహనాదికారి చంద్ర శేఖర్ మాట్లాడుతూ ప్రస్తుతం పొగాకు పంటలో సీటీఆర్ఐ అధికారులు సూచించిన పురుగు మందులను మాత్రమే అవసరం అయిన మోతాదులో పిచికారి చెయ్యాలి అన్నారు. సీనియర్ గ్రేడింగ్ ఆఫీసర్ రాజ గోపాల్ మాట్లాడుతూ పురుగు మందుల అవశేషాలు, పొగాకేతర అన్యపదర్ధలు లేని పొగాకుని పండించడం ద్వారా మంచి దిగుబడి తోపాటు మంచి ధరలు పొందొచ్చు అన్నారు. ప్రస్తుతం అంతర్జాతీయం గా వాతావరణ పరిస్థితులు కారణంగా పొగాకు పండించే బ్రిజిల్, చైనా, జింబంబే మొదలగు దేశాలలో పొగాకు ఉత్పత్తి అధికంగా ఉన్నది అని, కావున ఈ సంవత్సరం మన దేశంలో పొగాకు ధరలలో హెచ్చు తగ్గులు ఉండవచ్చును అని రైతులకు తెలియచేశారు. అందువల్ల రెట్కతులు ఎవ్వరూ కూడా అధిక ధరలకు బ్యారన్ లను మరియూ పొలాలను కౌలుకి తీసుకొని పొగాకు పంటను సాగు చేసి నష్టపోవద్దు అని తెలియజేశారు. ఈ కార్యక్రమం లో ఐటీసీ మేనేజర్ విజయ్ కుమార్ మాట్లాడుతూ మేము సరఫరా చేసే నీళ్లలో కరిగే ఎరువుల నీ అందరూ ఉపయోగించుకోవాలి అని తెలియజేశారు. అధిక వర్షపాతం పడినప్పుడు పంట వేసిన పొలాల్లో తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి తెలియజేశారు. జీపీఐ కంపెనీ ప్రతినిధి ఉన్నం శ్రీనివాసులు మాట్లాడుతూ ఈ సంవత్సరం పొగాకు పంట ధరలు అంత ఆశాజనకం గా ఉండకపోవచ్చునని మరియు మంచి గ్రేడు పొగాకు పండనట్లు అయితే రైతులు మరింత ఇబ్బంది పడవలసి వస్తుంది అని తెలియచేశారు. పొగాకు లో పొటాసియం వాడకం పెంచడం వల్ల కొంత హై గ్రేడు పొగాకు దిగుబడి సాధించవచ్చు అని మరియు పొగాకు మండేలమీద ఎక్కవ కాలం చెడిపోకుండా ఉండే సామర్థ్యం పెరుగుతుంది అని తెలియచేశారు. కావున రైతు సోదరులు పొగాకు బోర్డు అనుమతి ఇచ్చిన మేరకే పొగాకు పండించాలి అని కోరారు. ఈ కార్యక్రమం క్షేత సహాయకులు సిసింద్రీ, జ్యోష్ణ, మౌష్మిన్, నాగేంద్ర, ఆశ్చర్య బాబు, పొగాకు బోర్డు సిబ్బంది రైతులు పాల్గొన్నారు.